క్లుప్తంగా

శ్రీవారి సేవలో రుడా చైర్మన్



రుడా చైర్మన్‌కు స్వామివారి మొమెంటోను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రుడా చైర్మన్ బొద్దు వెంకటరమణ చౌదరి సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచారి స్వామివారి మొమెంటో, ప్రసాదాలను అందజేశారు.

ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు



వార్షికోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి ఆలయం 12వ వార్షిక వేడుకలకు ముస్తాబవుతోంది. ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ ఏర్పాట్లు కమిటీ సభ్యులు సెక్రెటరీ గంగు జగన్‌మోహన్‌రెడ్డి, గుంట్ల వెంకటేశ్వరరావు, కొల్లిపర కృష్ణారావు, రొక్కం కృష్ణారావు పర్యవేక్షణలో శరవేగంగా సాగుతున్నాయని అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ తెలిపింది.

టైలర్‌కు ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న టైలర్లు

ద్వారకాతిరుమల: మండలంలోని తిరుమలంపాలెంకు చెందిన టైలర్ షేక్ పెంటు సాహెబ్‌కు సోమవారం ఆంధ్రప్రదేశ్ టైలర్స్ రచ్చబండ, ఏలూరు జిల్లా టైలర్స్, ద్వారకాతిరుమల రచ్చబండ గ్రూప్ వారు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సాహెబ్‌కు తమ వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందజేసినట్లు ఆయా సంఘాల సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో టైలర్స్ రచ్చబండ గ్రూపు మెయిన్ అడ్మిన్ దొడ్డి నాగేశ్వరావు, నేలటూరి సత్యనారాయణ, సయ్యద్ సలీం, జంగం లక్ష్మణరావు, గుడివాడ అంజలీదేవి, వర్ధినీడి రంగనాగలక్ష్మి, దుర్గ, ఎండపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం పెంపు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పీఎండీ వెంకటేష్

ద్వారకాతిరుమల: పచ్చిరొట్ట ఎరువులు భూసారం, దిగుబడులు పెంచడానికి, తెగుళ్ల నివారించడానికి ఎంతగానో దోహదపడతాయని వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం పీఎండీ వెంకటేష్ అన్నారు. మండలంలోని గొల్లగూడెం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం ఆయన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురికి సన్మానాలు చేశారు. గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

అన్నదానం



కొండపల్లిలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు: కొండపల్లి గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించిన నేపథ్యంలో అటు గ్రామస్తులకు, ఇటు భద్రాచలం నుంచి తిరుగు ప్రయాణంలో ఉన్న భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు పాధ్యా వెంకటేశ్వర్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు చెప్పారు.

అంబేడ్కర్ జయంతికి ఆహ్వానం

కొయ్యలగూడెం: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొనాల్సిందిగా మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్‌ను ఆహ్వానించినట్లు విద్యావేత్త అలుగు ఆనంద్‌శేఖర్ మంగళవారం తెలిపారు. కొయ్యలగూడెంలో ఈనెల 15వ తేదీన రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాటం ప్రసాద్, బొగ్గవరపు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఈత.. జాగ్రత్త

- ప్రాణం తీసే సరదా అంటున్న నిపుణులు
- కచ్చితమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



చెరువులో ఈతకొడుతున్న పిల్లలు

బుట్టాయగూడెం: పిల్లలకు, పెద్దలకు చెరువుల్లో ఈత కొట్టడం సరదా. కానీ ఆ సరదా వెనుక ప్రాణం తీసే ప్రమాదం పొంచి ఉంది. ఈత రాకుండా, ఎవ్వరి పర్యవేక్షణ లేకుండా చెరువుల్లో ఈతకు దిగితే ఇక అంతే సంగతులు. వేసవి సెలవుల్లో ఎక్కువగా విద్యార్థులు చెరువుల్లో, బావుల్లో, ప్రాజెక్టుల్లో ఈత కొట్టేందుకు సరదా పడుతుంటారు. అయితే ఈతపై అప్రమత్తంగా లేకుంటే తల్లిదండ్రులకు గుండె కోత తప్పదంటున్నారు నిపుణులు. పోలవరం నియోజకవర్గం పరిధిలోని గిరిజన మండలాల్లో గల గ్రామాల్లో సుమారు 128 చెరువులు ఉన్నాయి. వీటిలో 40 పెద్ద చెరువులు, 81 చిన్న చెరువులు ఉన్నాయి. గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం, కొవ్వాడ ప్రాజెక్టు, పోగొండ రిజర్వాయర్ ఉన్నాయి. ఆయా చెరువుల్లో, ప్రాజెక్టుల్లో కొంతమేర నీరు ఉంది. అనేక మంది గ్రామాల్లో ఉంటున్న ప్రజలు దుస్తులు ఉతకడానికి వెళ్తుంటారు. అలాగే అక్కడ సరదాగా ఈతకు వెళ్లి కొందరు మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి.

జాగ్రత్తలు పాటించాలి

ఈత రానివారు, ఈతకు వెళ్లే ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఖచ్చితంగా మనిషి నీటిలో మునిగిపోకుండా మునగ, కలబంద కట్టెలను కట్టుకోవాలి. ఈత నేర్పించాలనుకునేవారు ఈత రాని వారి నడుముకు తాడు కట్టి గట్టుపై ఒకరు ఉండి ఈత నేర్పించాలి. ఈతకు వెళ్లే వారు తప్పని సరిగా తమ వెంట మునగ కట్టెలు, ఈత వచ్చిన వారిని వెంట తీసుకుని వెళ్లాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈత రాని వారిని ఈత నేర్చుకుంటున్న వారు ఒక కంట కనిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఇలా చేయడం మంచిది

- ఈత కొట్టేటప్పుడు శరీర నిర్మాణానికి అనువైన స్విమ్మింగ్ సూట్ వేసుకోవాలి
- తల వెంట్రుకలు తడవకుండా మాస్క్ లాంటిది ధరించాలి
- నీటిలో తడవటం వల్ల చర్మ సంబంధింత వ్యాధులు రాకుండా వాజిలిన్ వంటివి పూసుకోవాలి.
- ముఖాన్ని పైకి ఉంచి ఈదాలి. ఊపిరి పీల్చుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి.
- బావి, చెరువులోకి దూకేటప్పుడు కాళ్లు ముందుగా నీళ్లను తాకేలా చూసుకోవాలి. తల కిందుగా డైవింగ్‌లా దూకడం ప్రమాదం.
- అడుగుభాగంలో బండరాళ్లు, చెరువుల్లో ఎండిన కొమ్మలు ఉంటాయి. అలాంటి వాటిలోతును ముందుగా అంచనా వేయకపోతే ప్రమాదం.
- అరగంట కంటే ఎక్కువసేపు ఈత కొట్టకూడదు. గంటల కొద్దీ ఈదడం వల్ల ఊపిరి ఆడదు. ఈతకొట్టే సమయంలో ఇతరులు మునిగిపోయినట్లు గమనిస్తే ఎంతటి నిపుణులైనా ఈతకొట్టేందుకు దూకకూడదు. కర్రలు, తాడు పరికరాల సహాయంతో కాపాడాలి.

గిరి ప్రదక్షిణ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం గిరి ప్రదక్షిణ రోడ్డుకు అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో మానికల రాంబాబు మాట్లాడుతూ దాత నరసాపురం ఎంపీ గోకరాజు గంగరాజు సొంత నిధులతో గోకుల తిరుమల పారిజాతగిరికి గిరిప్రదక్షిణ రోడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. పారిజాతగిరికి ఏడు కొండలు దూరం సుమారు 2.5 కిలోమీటర్లు అని, ఎంపీ గంగరాజు అందించిన రూ.55 లక్షల సొంత నిధులతో 10 అడుగుల వెడల్పున సిమెంట్ రోడ్డు నిర్మించనున్నట్లు ఈవో చెప్పారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పేరిచర్ల జగపతిరాజు పర్యవేక్షణలో రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి రంగప్రసాద్, వాసవీ సాయి నగేష్, దండు ధనరాజు, గొట్టుముక్కల భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయండి



కంభం విజయరాజు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త

చింతలపూడి: వైఎస్సార్ సీపీ జిల్లా కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు మినీ బైపాస్ రోడ్‌లో ఉన్న క్రాంతి కల్యాణ మండపంలో జిల్లా వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శాసన మండలి ప్రతిపక్ష నేత, ఉభయ గోదావరి జిల్లాల పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు, పార్లమెంట్ కోఆర్డినేటర్ కారుమూరి సునీల్ కుమార్, నియోజకవర్గాల ఇన్‌చార్జులు పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు), మామిళ్ళపల్లి జయప్రకాష్ (ఏలూరు), కొఠారు అబ్బయ్య చౌదరి (దెందులూరు), మేక వెంకట ప్రతాప్ అప్పారావు (నూజివీడు), తెల్లం బాలరాజు (పోలవరం), పార్టీ ముఖ్య ముఖ్య నాయకులు పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమానికి చింతలపూడి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా

జంగారెడ్డిగూడెం: రైతులకు ఇచ్చిన ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్, జిల్లా కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వెట్టి సుబ్బన్న, నాయకులు కారం రాఘవ మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు సంవత్సరానికి రూ.20వేల ఆర్థిక సాయం చేస్తామని, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, వ్యవసాయ పరికరాల రేట్లు, ఎరువులు, పురుగుమందులు రేట్లు తగ్గిస్తామని అనేక రకాల వాగ్దానాలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి ఇచ్చిన హామీలు అమలు చేయడం కోసం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. వరి, పొగాకు, మిర్చి, మొక్కజొన్న, పత్తి, జీడి మామిడి తదితర పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



చెస్‌లో ప్రశంసాపత్రాలు అందుకున్న చిన్నారులు

జంగారెడ్డిగూడెం: ఏలూరు తంగెళ్ళమూడిలో జరిగిన జిల్లాస్థాయి అండర్–7 చెస్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 5న ఏలూరు శ్రీ సరస్వతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఏలూరు జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో పాల్గొన్న జంగారెడ్డిగూడెం హంస చెస్ అకాడమీ విద్యార్థులు దీక్షిత (ప్రథమ స్థానం), ఇషిత (ద్వితీయ స్థానం) సాధించారు. వీరిద్దరూ మే 3, 4 తేదీల్లో పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని శ్రీ హంస అకాడమీ కోచ్ కన్న సూర్య నాగేశ్వరరావు (నాగు) తెలిపారు. ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో చెస్ అకాడమీ కోచ్ నాగు జ్ఞాపికలను అందజేశారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి



జంగారెడ్డిగూడెంలో ద్విచక్ర వాహనదారుడికి అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో ఎండీ మదని

జంగారెడ్డిగూడెం: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణా అధికారి ఎండీ మదని అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం హెల్మెట్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎండీ మదని మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహన నిబంధనలు తప్పక పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా తలకు బలమైన గాయం కావడం వల్లే మృత్యువాతకు గురవుతున్నారన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల తలకు గాయాలు కాకుండా ప్రమాద తీవ్రత తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటివి ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. కావున వాహనాలు నడిపే ప్రతి వ్యక్తి వాహన నిబంధనలు అర్థం చేసుకుని, వాటిని పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ ఎస్ఎస్ రంగనాయకులు, ఏఎంవీఐ వై.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు



నామవరంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నామవరం గ్రామంలో సోమవారం నాటు సారా స్థావరాలపై అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో భూక్యా నాగరాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. అలాగే టి.నర్సాపురం మండలం కొత్తగూడెం గ్రామంలో పాత నాటు సారా కేసుల్లో నిందితులుగా ఉన్న బి.దుర్గారావు, బంధాల మరియదాసులను మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. కామవరపుకోట మండలం ఆడమిల్లి గ్రామానికి చెందిన మిడతా నాగ దుర్గాప్రసాద్ ను కామవరపుకోట తహసీల్దార్ ఎదుట హాజరు పరచి బైండ్‌ఓవర్ చేసినట్లు సీఐ పి అశోక్ తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి ఎక్సైజ్ ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, జె.జగ్గరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చుకల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



పిచ్చుకల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం పిచ్చుకల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. ఎన్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెంకు చెందిన పిచ్చుకల సంరక్షణ, పరిశోధనా సంస్థ డైరెక్టర్ డా. వీర మహేష్ అతిథిగా పాల్గొని పిచ్చుకల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం చెక్కతో చేసినటువంటి ఐదు పిచ్చుకల గూళ్ళను కళాశాలకు అందించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు, జంతు శాస్త్ర విభాగ అధ్యాపకురాలు ఆర్.విజయ దీపిక మాట్లాడుతూ వేసవి కాలంలో చిన్న చిన్న జీవజాతులకు మన వంతు సహాయాన్ని అందించాలని, ప్రతి ఇంటి బయట వీలైనంతవరకు మంచినీరు, చిరుధాన్యాలు లాంటివి ఏర్పాటు చేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. మట్టా మధు, అధ్యాపకులు టి.ఝాన్సీరాణి, వి.హనుమంతరావు, ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల షాపులో విజిలెన్స్ తనిఖీలు



ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కామవరపుకోట: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఎరువుల షాపులో తనిఖీలు నిర్వహించారు. స్థానిక కొత్తూరులోని శ్రీ సూర్య ఆగ్రో ఎంటర్‌ప్రైజెస్ ఎరువుల పురుగు మందుల షాపులో విజిలెన్స్ ఏవో జి.మీరయ్య తన సిబ్బందితో తనిఖీ చేయగా ×ఓ‌ె ఫారం లేనటువంటి రూ. 1,51,250 విలువ కలిగిన 6.550 మెట్రిక్ టన్నుల ఎరువులు, ప్రిన్సిపల్ సర్టిఫికేట్ లేని రూ. 91,880 విలువ కలిగిన 24 లీటర్ల పురుగు మందులు గుర్తించి అమ్మకాలు నిలుపుదల చేయించారు. ఈ తనిఖీలో విజిలెన్సు ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సి.పవన్‌కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ తలంబ్రాల పంపిణీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో శ్రీ సీతా రామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాల పంపిణీని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. శ్రీరామనవమి పర్వదినం రోజున భద్రాచలంలో జరిగిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తలంబ్రాలు విశ్వహిందూ పరిషత్ జంగారెడ్డిగూడెం శాఖ ద్వారా పట్టణంలోని విజయ దుర్గమ్మ ఆలయ కమిటీకి అందాయి. భక్తులందరికీ ఆలయ కమిటీ తరఫున కల్యాణ తలంబ్రాలు పంపిణీ చేస్తున్నట్లు వీహెచ్‌పీ సభ్యులు తెలిపారు.

పంటలను పరిశీలించిన ఏవో



పోలవరం మండలంలో ఈదురుగాలులకు పడిపోయిన పంటను పరిశీలిస్తున్న ఏవో

పోలవరం రూరల్: మండలంలో ఆదివారం వీచిన ఈదురుగాలుల ప్రభావంతో మొక్కజొన్న, వరి పంటలు నేలమట్టమయ్యాయి. సోమవారం మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు గూటాల, కొత్త పట్టిసీమ ప్రాంతాల్లో పొలాలను పరిశీలించి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న, వరి పంటలు చివరి దశలో ఉన్నాయని, గాలులకు బాగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దీని వల్ల రైతులకు కొంతమేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు ఏవో చెప్పారు.

లాంగ్ రన్నింగ్‌లో పతకాల పంట

ఏలూరు రూరల్ : పరుగు పందెంలో లాంగ్ రన్నింగ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో సత్తా చాటాలంటే కఠోర సాధన అవసరం. శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా బలంగా ఉండాలి. శరీరంలో సత్తువ తగ్గిపోతున్నప్పటికీ సుదూరంలో ఉన్న లక్ష్యాన్ని ఛేదించాలన్న పట్టుదల పెరుగుతూనే ఉండాలి. అందుకే అనేక మంది అథ్లెట్లు లాంగ్ రన్నింగ్‌లో పోటీ పడేందుకు వెనకడుగు వేస్తారు. నిమిషాల్లో ముగిసిపోయే 100, 200, 400 మీటర్ల పరుగు పందెంలో పోటీ పడేందుకే ఇష్టపడతారు. ఇందుకు భిన్నంగా ఏలూరు సాయ్ సెంటర్ అథ్లెట్ జి.వెంకట్ లోకేష్ లాంగ్ రన్నింగ్‌లో అద్భుత ప్రతిభ చాటుతున్నాడు. కోచ్ డీఎస్‌వీ వెంకట ప్రసాద్ పరివేక్షణలో కఠోర సాధన చేస్తున్నాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అద్భుత ప్రతిభా పాటవాలు చాటుతున్నాడు.

16 ఏళ్ల వయస్సులోనే..

వెంకట్‌లోకేష్ స్కూల్, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు పంట పండిస్తున్నాడు. 2023 నుంచి 2025 వరకు జరిగిన పోటీల్లో లాంగ్‌రన్నర్‌గా రాణిస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం స్కూల్ స్థాయి పోటీల్లో పాల్గొని కేవలం 4 నిమిషాల 26 సెకన్లలో 1500 మీటర్ల పరుగు పందెం పూర్తిచేసి బంగారు పతకం సాధించాడు. 59వ రాష్ట్ర స్థాయి క్రాస్‌కంట్రీ పోటీలో 6.03 నిమిషాల్లో పరుగు పూర్తి చేసి సిల్వర్ మెడల్ చేజిక్కించుకున్నాడు. ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్‌మెడల్ సాధించాడు. 2004లో జరిగిన ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ మీట్‌లో 2 వేల పరుగు పందెం 6.36 సెకన్లు, ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీల్లో 1500 మీటర్ల పరుగు 4.23 సెకన్లతో పూర్తి చేసి సత్తా చాటాడు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

టి.నరసాపురం: మండలంలోని 33/11కేవీ రాజుపోతేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ కొత్తగూడెం ఫీడర్ పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడతాయని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. అలాగే 3 ఫేజ్ విద్యుత్ సప్లయి సమయాల్లో మార్పులు ఉంటాయని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అధిక విద్యుత్ లోడ్‌ను క్రమబద్ధీకరించుకోండి

జంగారెడ్డిగూడెం: గృహ విద్యుత్ వినియోగదారులు వారి గృహాలకు వినియోగిస్తున్న అధిక విద్యుత్ లోడును క్రమబద్ధీకరించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధిక లోడును క్రమబద్ధీకరించుకునేందుకు విద్యుత్‌శాఖ డెవలప్‌మెంట్ చార్జీలపై 50 శాతం ప్రకటించిందన్నారు. అంటే ప్రతి అదనపు కిలో వాట్‌కి డెవలప్‌మెంట్ చార్జీ రూ.2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, అప్లికేషన్ ఫీజు రూ.50 వసూలు చేస్తుండగా, ప్రస్తుతం 50 శాతం రాయితీతో ప్రతి కిలోవాట్‌కు రూ.1,250 మాత్రమే చెల్లించాలన్నారు. కావున గృహ విద్యుత్ వినియోగదారులు వాలంటీరుగా వారి అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. ఈ పథకం కేవలం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందని తెలిపారు. ఒకవేళ గృహ వినియోగదారులు వారి అదనపు లోడు క్రమబద్ధీకరించుకోని యెడల విద్యుత్‌శాఖ తనిఖీలో గుర్తించినట్లయితే పూర్తి సొమ్ము ప్రతి కిలోవాట్‌కు రూ. 2,250 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్డీవో ఎంవీ రమణ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలను ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు క్షుణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై 16 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



జంగారెడ్డిగూడెంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. వేసవి దృష్ట్యా పట్టణానికి వచ్చే వారు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మునిసిపల్ కమిషనర్ కె.వెంకటరమణ, ఏఈ రాజేష్, కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, కంచుమర్తి ప్రకాష్, పెసరగంటి త్రిమూర్తులు, నాని, సుభాని తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: బుట్టాయగూడెంలో శెట్టిబలిజ యువజన సంఘం, పోలవరం నియోజకవర్గ నాయకులు పిల్లి రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, నాయకులు కరాటం సాయి సోమవారం ప్రారంభించారు.